సాక్షి విశాఖపట్నం

బుధవారం । 7 । ఆగస్టు । 2024



జ్యోతి వెలగాలి.. జాతి మురవాలి 8లో



అందుబాటులో విజ్ఞాన కేంద్రాలు

విజ్ఞాన కేంద్రాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి కుంచె జ్ఞానవేణి కోరారు. 8లో



సామర్లకోట హాల్ట్ పొడిగింపు

విశాఖపట్నం–సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు సామర్లకోటలో ప్రయోగాత్మక హాల్ట్‌ను మరో 6 నెలలు పొడిగించినట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో

న్యూస్‌రీల్

ఈఎన్‌సీని సందర్శించిన నేవీ చీఫ్ ఆఫ్ పర్సనల్



వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లాకు జ్ఞాపిక అందిస్తున్న ఈఎన్‌సీ చీఫ్ రాజేష్ పెంధార్కర్

సింధియా: భారత నావికాదళ చీఫ్ ఆఫ్ పర్సనల్, ఏవీఎస్ఎం, ఎన్ఎం వైస్ అడ్మిరల్ సంజయ్ భల్లా మంగళవారం తూర్పు నావికాదళాన్ని సందర్శించారు. ఈఎన్‌సీ ఫ్లాగ్ ఆఫీసర్, వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కమాండ్‌లోని పలువురు అధికారులు, నావికులు, వివిధ విభాగాల హెచ్ఆర్‌లకు చీఫ్ ఆఫ్ పర్సనల్ పలు సూచనలు చేశారు. అనంతరం నేవల్ డాక్‌యార్డ్‌ను సందర్శించారు. ఇయర్ ఆఫ్ నేవల్ సివిలియన్స్‌లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాల గురించి అక్కడి అధికారులు ఆయనకు వివరించారు.

మహిళల అభివృద్ధికి అవగాహన ఒప్పందం



ఒప్పందం చేసుకుంటున్న సంస్థల ప్రతినిధులు

బీచ్‌రోడ్డు: విశాఖపట్నం చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మహిళా విభాగం, ఆంధ్రా యూనివర్సిటీ ఇంక్యుబేషన్ కౌన్సిల్, టీఐఈ విశాఖపట్నం వ్యూహాత్మక అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. ఈ మేరకు నగరంలోని ఓ హోటల్‌లో మంగళవారం ఒప్పంద పత్రాలు మార్చుకున్నాయి. ఈ సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యా గోడె మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విశాఖ మహిళా నేతృత్వంలోని స్టార్టప్‌ల స్థాపన, ఉన్న వ్యాపారాలను గుర్తించి ఇంక్యుబేషన్ సెంటర్ ద్వారా ఇంకా అభివృద్ధి చేస్తామన్నారు. టీఐఈ విశాఖపట్నం అధ్యక్షుడు శ్రీ రవి ఈశ్వరపు, ఇంక్యుబేషన్ కౌన్సిల్ మేనేజర్ డా. దివాకర్ వడపల్లి, శ్రీనివాస్ సవరం , మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు అనిలా నార్ల, కార్యదర్శి పర్వీన్ హుసేన్, కోశాధికారి వాణి కంచర్ల పాల్గొన్నారు.

సెల్ఫ్ సపోర్ట్ ఇంజినీరింగ్ ప్రవేశాలు పూర్తి

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో సెల్ఫ్ సపోర్ట్ విధానంలో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయ్యాయని ప్రవేశాల సంచాలకుడు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేకంగా ఏయూఈఈటీ–2024 పరీక్ష నిర్వహించి కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు పూర్తిచేసినట్లు చెప్పారు. ఈ ప్రవేశాలకు అనూహ్యమైన స్పందన లభించిందని, అన్ని కోర్సుల్లో సీట్లు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయని వెల్లడించారు. ప్రవేశాల కోసం తమ కార్యాలయానికి రావద్దని ఆయన సూచించారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: చెన్నై సెంట్రల్–బేసిన్ బ్రిడ్జి స్టేషన్‌ల మధ్య వంతెన పునర్నిర్మాణం నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే బొకారో ఎక్స్‌ప్రెస్‌ను దారి మళ్లిస్తున్నారు. అలప్పుజ–ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఈ నెల 8, 10, 13, 15, 17, 20, 22, 24, 27, 29వ తేదీల్లో రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా పాదనూర్, ఇరుగూర్, సూరత్‌కల్ స్టేషన్ల మీదుగా నడుస్తుంది. ప్రయాణికుల సౌకర్యార్థం పాదనూర్‌లో హాల్ట్ కల్పించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

ఆలస్యంగా కోరమండల్ ఎక్స్‌ప్రెస్

డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్–షాలిమర్(12842) కోరమండల్ ఎక్స్‌ప్రెస్ తొమ్మిదిన్నర గంటలు ఆలస్యంగా మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్‌లో బయలుదేరింది. పెయిరింగ్ రైలు ఆలస్యంతో ఈ రైలు ఆలస్యంగా నడుస్తోంది.

జనసేనలోకి ఐదుగురు కార్పొరేటర్లు

సాక్షి, విశాఖపట్నం : వైఎస్సార్ సీపీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు పార్టీని వీడి జనసేనలో చేరారు. మంగళవారం సాయంత్రం జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ సమక్షంలో మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పుకున్నారు. 59వ వార్డుకి చెందిన పుర్రె పూర్ణశ్రీ, 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ, 47వ వార్డు కంటిపాము కామేశ్వరి, 77వ వార్డు భట్టు సూర్యకుమారి, 42వ వార్డు కార్పొరేటర్ ఆళ్ల లీలావతితో పాటు పలువురు మాజీ కార్పొరేటర్లు జనసేనలో చేరారు.

రిసార్ట్ పాలిట్రిక్స్

- కార్పొరేటర్లను భీమిలి రిసార్టుకు తరలించిన టీడీపీ
- పోలింగ్ సమయానికి తీసుకొచ్చేందుకు సన్నాహాలు
- నేడు జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు
- ప్రలోభాలే అజెండాగా కూటమి నేతలు
- వైఎస్సార్ సీపీ, ఇండిపెండెంట్లకు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల ఎర



సాక్షి, విశాఖపట్నం : **గ్రేటర్ రాజకీయాలు రిసార్టుకు చేరుకున్నాయి. అధికారంలోకి వచ్చాక జీవీఎంసీ** స్టాండింగ్ కమిటీ **ఎన్నికలను కూటమి ప్రతి**ష్టాత్మకంగా తీసుకుంది. **తమకు అలవాటైన కొను**గోళ్ల ఎరతో **కార్పొరేటర్లను మభ్యపెట్టింది.** తమకు మద్దతునిచ్చిన **కార్పొరేటర్లు** ఎక్కడ చేజారిపోతారోనన్న భయంతో క్యాంపు రాజకీయాలు చేస్తోంది. అందరిని భీమిలిలోని ఓ రిసార్టుకి తరలించేసింది. పోలింగ్ సమయానికి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. మరోవైపు విజయమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. బుధవారం ఉదయం 10 గంటలకు స్టాండింగ్ కమిటీ ఎన్నికల పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రారంభించి విజేతలను ప్రకటించనున్నారు.

ఇవీ బలాబలాలు

గ్రేటర్‌లో 98 మంది వార్డులుండగా ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లున్నారు. 21 వార్డు కార్పొరేటర్ వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉండటంతో ఈ స్థానం ఖాళీగా ఉంది. మిగిలిన వారిలో కొందరు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు.. డబ్బులకు అమ్ముడుపోయి టీడీపీ, జనసేనలో చేరారు. వాస్తవానికి 97 మందిలో వైఎస్సార్ సీపీ నుంచి 58 మంది, టీడీపీ నుంచి 29, జనసేన నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్స్ నలుగురు, సీపీఐ, సీపీఎం, బీజేపీలో చెరో కార్పొరేటర్ విజయం సాధించారు. పార్టీలు మారిన తర్వాత ప్రస్తుత బలాబలాలు చూస్తే.. వైఎస్సార్ సీపీలో 46 మంది, టీడీపీలో 37, జనసేనలో 8, సీపీఐ, సీపీఎం, బీజేపీ ఒక్కొక్కరుండగా స్వతంత్రులు ముగ్గురున్నారు. మొత్తంగా ప్రస్తుతం చూస్తే.. ఒక ఇండిపెండెంట్‌తో కలిపి వైఎస్సార్ సీపీకి 47, కూటమికి 47తో పాటు ఇద్దరు ఇండిపెండెంట్స్ మద్దతుతో కలిపి మొత్తం 49 మంది కార్పొరేటర్ల బలం ఉంది. ఈ లెక్కన వైఎస్సార్‌సీపీ కంటే కూటమికే బలం ఉన్నా భయంతో బిక్కుబిక్కుమంటుండటం గమనార్హం.

ఓటమి భయంతో..

అధికార టీడీపీ నేతలకు ఓటమి భయం పట్టుకొని రిసార్టు రాజకీయాలకు తెరతీసింది. తమకు మద్దతుగా ఉన్న కార్పొరేటర్లు చేజారిపోతారేమోనన్న భయంతో కార్పొరేటర్లను భీమిలిలోని ఓ రిసార్టుకి తరలించారు. తమతో వచ్చిన కార్పొరేటర్లకు రూ.3 లక్షలు చొప్పున అందించినట్లు సమాచారం. మంగళవారం మధ్యాహ్నం తమ మద్దతు కార్పొరేటర్లను రిసార్టుకు చేర్చగా.. వీరిలో కొందరు కార్పొరేటర్లు మనసు మార్చుకొని ఇంటికి వెళ్లిపోతామని చెప్పడంతో టీడీపీలో మళ్లీ భయం పట్టుకుంది. వారిని బుజ్జగించే పనిని కీలక కార్పొరేటర్లకు అప్పగించారు. రిసార్టు దగ్గర జామర్లు కూడా అమర్చినట్లు సమాచారం.

ఇండిపెండెంట్ కార్పొరేటర్లను తమ వైపు తిప్పుకునేందుకు లాబీయింగ్ నడుపుతున్నారు. చివరి వరకు ఎవరు దొరికితే వారికి రూ.3 నుంచి రూ.5 లక్షలైనా ఇచ్చి ఓటు వేయించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నారు. రాష్ట్రంలో అధికారం మారడంతో వైఎస్సార్ సీపీ, కూటమి పార్టీలు స్టాండింగ్ కమిటీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. ఇప్పటి వరకు గ్రేటర్ పరిధిలో 3 సార్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగ్గా.. మూడు పర్యాయాలూ వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగరేసింది. అందుకే ఈసారి ఎన్నికలు రసవత్తరంగా మారాయి. మొత్తం వైఎస్సార్‌సీపీ నుంచి 10 మంది, టీడీపీ నుంచి 10 మంది బరిలో ఉన్నారు. ఈ 20 మందికి 97 మంది కార్పొరేటర్లు ఓట్లు వేయనున్నారు. ఈ ఎన్నికల్లో తమ పార్టీ తరపున ఓటు వినియోగించుకోడానికి దూరంగా ఉంటున్నట్లు సీపీఐ కార్పొరేటర్ గంగారావు ప్రకటించారు. అంటే 96 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.



ఏ అభ్యర్థికైతే ఎక్కువ మంది కార్పొరేటర్లు బలపరుస్తూ ఓటు వేస్తారో వారే ఏడాది పాటు స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతారు.

వాళ్లు ఓటేస్తారా..?

ఈ లెక్కలు ఇలా ఉంటే కూటమికి రెబల్స్ భయం పట్టుకుంది. పోటీలో ఉన్న 10 మంది టీడీపీ కార్పొరేటర్లే కావడంతో జనసేన, బీజేపీతో పాటు మద్దతునిస్తున్న ఇండిపెండెంట్లు కూడా గుర్రుగా ఉన్నారు. బీజేపీ మహిళా కార్పొరేటర్ నుంచి అవమానకరంగా నామినేషన్లను వెనక్కి లాగేసుకున్నారు. దీంతో ఆమె టీడీపీ వైఖరిపై మండిపడుతున్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు సైతం.. తమ పేర్లను పరిగణనలోకి తీసుకోకపోవడంపై జనసేన కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదే వైఖరి ఇండిపెండెంట్లలోనూ కనిపిస్తోంది. ఇప్పటికే కొందరు కార్పొరేటర్లు తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకొని అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీంతో టీడీపీ నేతలు అయోమయంలో ఉన్నారు. బలం లేకపోయినా సగం సీట్లయినా తాము గెలుస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు దీమాగా ఉండగా కుట్ర రాజకీయాల్నే నమ్ముకున్న టీడీపీలో మాత్రం భయాందోళనలే కనిపిస్తున్నాయి.



నగరంలోకి మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్!

- పశ్చిమ బెంగాల్ నుంచి రాక
- వారిని పట్టుకునేందుకు రంగంలోకి అక్టోపస్ బలగాలు
- శనివారం రాత్రి సినిమా తరహాలో ఆపరేషన్
- అప్పటికే వారు వెళ్లిపోయినట్టు నిర్ధారణ

విశాఖ సిటీ : ప్రశాంత విశాఖలో ఒక్కసారిగా అలజడి రేగింది. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్ విశాఖలోకి చొరబడ్డారని పశ్చిమ బెంగాల్ పోలీస్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు విశాఖ పోలీసులు అప్రమత్తమయ్యారు. మూడు రోజుల కిందట రహస్యంగా సెర్చ్ ఆపరేషన్ నిర్వహించిన విషయం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో ముగ్గురు క్రిమినల్స్ ఆయుధాలు చూపించి అక్కడి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేశారు. మరికొంత మందిని డబ్బులు డిమాండ్ చేసినట్లు అక్కడి పోలీసులకు ఫిర్యాదులు అందాయి. అలాగే ఖరగ్‌పూర్‌లో ఓ హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్న వీరి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

అయితే క్రిమినల్స్ అక్కడి నుంచి విశాఖకు వచ్చారని.. రామ్‌నగర్‌లోని ఓ హాస్టల్లో తిష్టవేశారని సాంకేతికత ఆధారంగా పశ్చిమ బెంగాల్ పోలీసులు తెలుసుకున్నారు. వెంటనే విశాఖ పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. క్రిమినల్స్ వద్ద ఆయుధాలు ఉన్నాయన్న సమాచారంతో అక్టోపస్ సాయుధ బలగాలను రంగంలోకి దింపారు. పశ్చిమ గోదావరి పోలీసులు, అక్టోపస్ బలగాలు శనివారం రాత్రి రామ్‌నగర్ ప్రాంతంలోని హాస్టల్ పరిసర ప్రాంతాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. సినిమా తరహాలో బిల్డింగ్‌లు, గోడలు ఎక్కి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సుమారు రెండు గంటల పాటు ఈ ఆ ఆపరేషన్ సాగింది. అయితే క్రిమినల్స్ ఇక్కడి నుంచి కొద్ది రోజుల కిందటే వెళ్లిపోయినట్లు తెలుసుకున్నారు. అయితే సాయుధ బలగాల సెర్చ్ ఆపరేషన్ చూసిన స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు కూడా ఈ ఆపరేషన్‌ను రహస్యంగా ఉంచారు. ప్రస్తుతం ఆ క్రిమినల్స్ విశాఖ నుంచి విజయవాడకు వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు

కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నిర్వహణకు సంబంధించి పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియామవళిని (ఎంసీసీ కోడ్) పటిష్టంగా అమలు చేయాలన్నారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో రెవెన్యూ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమావేశయ్యారు. చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలని, అనుమతులకు సంబంధించి కలెక్టరేట్‌లో సింగిల్ విండో విధానం అందుబాటులోకి తీసుకురావాలన్నారు. జిల్లా పరిధిలోని రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని, పోస్టర్లు తొలగించాలని సూచించారు. అనుమతులు లేకుండా రాజకీయపరమైన సమావేశాలు, ర్యాలీలు జరగడానికి వీలులేదని, ఎంసీసీ కమిటీలు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రాజకీయ ప్రకటనకు ఎంసీఎంసీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జేసీ కె.మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్, నగర జాయింట్ సీపీ ఫకీరప్ప, డీఆర్వో కె.మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

తొలి రోజు నామినేషన్లు నిల్

స్థానిక సంస్థల కోటాలో ఈ నెల 30న జరగనున్న ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు మంగళవారం నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లా రిటర్నింగ్ అధికారి హోదాలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ నోటిఫికేషన్ జారీ చేశారు. కాగా.. తొలి రోజు నామినేషన్లు దాఖలు కాలేదు. ఈ నెల 13వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి గడువు ఉంది. 14న నామినేషన్ల పరిశీలన, 16వ తేదీని ఉపసంహరణకు గడువుగా నిర్ణయించారు. 30న ఎన్నిక నిర్వహిస్తారు.

విద్యార్థులపై ఒత్తిడి వద్దు

ఆరిలోవ: విద్యార్థులను శారీరక దండనకు గురి చేయకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు తెలిపారు. విశాఖ వేలీ స్కూల్‌లో మంగళవారం జిల్లాలో విద్యా సంస్థలకు సంబంధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లతో ఆర్జేడీ విజయభాస్కర్, డీఈవో ఎల్.చంద్రకళ, డైట్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు సమక్షంలో 'విద్యా హక్కు చట్టం–2009'పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను మానసిక ఒత్తిడికి, శారీరక దండనకు గురిచేయడంలాంటి చర్యలు చేపట్టకూడదన్నారు. ప్రతి పాఠశాల, కళాశాలల్లో ప్రహరీ క్లబ్‌లు నిర్వహించాలన్నారు. వాటిద్వారా తరుచూ బాలల భద్రత, రక్షణ, డ్రాప్ అవుట్స్, బాల కార్మికులు, డ్రగ్స్ నియంత్రణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తుండాలని సూచించారు. బాలలకు వచ్చే సమస్యలు ఏవిధంగా ఎదుర్కోవాలో తెలియజేయాలన్నారు. చట్టాలు గురించి గోడలపైన స్లోగన్లు రాయించడం, హోర్డింగ్‌లు ఏర్పాటు చేయడం, గోడ పత్రికలు ముద్రించడం చేయాలన్నారు. అనంతరం ఆర్జేడీ విజయభాస్కర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు బాధ్యతగా తీసుకొని విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. డీఈవో ఎల్.చంద్రకళ మాట్లాడుతూ విద్యార్థులపై ఒత్తిడి లేని విద్య అందించడం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధనకు కృషి చేయాలని సూచించారు. సదస్సులో అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ శ్రీనివాస రావు, విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరి ప్రభాకర్, రిసోర్స్ పర్సన్లు శివలక్ష్మి, సునీత, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న కేసలి అప్పారావు

29న ఐటీఐ మూడో విడత కౌన్సెలింగ్

కంచరపాలెం: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 29 ప్రైవేట్ ఐటీఐల్లో 2024–25 విద్యా సంవత్సరంలో వివిధ ట్రేడ్‌ల్లో మిగులు సీట్ల భర్తీకి ఈ నెల 29న మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐలో ఆ రోజు కౌన్సెలింగ్ ఉంటుందని ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, నరవ ఐటీఐ ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. 2024–2025, 2024–2026 ట్రేడ్‌లలో చేరేందుకు ఈ నెల 26లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు దరఖాస్తు ప్రింట్, అన్ని ఒరిజనల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

వీధి రౌడీల్లా వీరంగం

- దారి తప్పుతున్న విద్యార్థిలోకం
- చెడు అలవాట్లకు బానిసలై అల్లర్లు
- అడ్డుకునే పోలీసులపైనే దాడులు

విశాఖ సిటీ: విద్యార్థుల వికృత చేష్టలు పెచ్చుమీరుతున్నాయి. కౌమార దశలోనే దారి తప్పుతున్నారు. చెడు తిరుగుళ్లు.. గొడవలు.. జల్సాలు.. దురలవాట్లు.. నేరపూరిత ప్రవర్తనతో హద్దుమీరుతున్నారు. చక్కగా కాలేజీకి వెళ్తూ బుద్ధిగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాల్సిన విద్యార్థుల్లో కొంత మంది వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారు. ఇంటర్ వయసులోనే గ్యాంగ్‌లు మెయింటేన్ చేస్తూ.. రోడ్డున పడి కొట్టుకుంటున్నారు. తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేస్తూ వారి పరువు తీస్తున్నారు. తాజాగా బాజీ జంక్షన్‌లో నడి రోడ్డులో విద్యార్థులు ముష్టి యుద్ధ ఘటన అందరినీ షాక్‌కు గురిచేసింది. రద్దీగా ఉండే జంక్షన్‌లో వందల మంది జనాల మధ్య విద్యార్థులు వీరంగం సృష్టించారు. సీనియర్, జూనియర్ల మధ్య తలెత్తిన వివాదంలో సీనియర్ విద్యార్థి అన్నయ్య కలగజేసుకోవడంతో ఘర్షణకు దారితీసింది. సినిమా తరహాలో గ్యాంగ్ వార్‌ను తలపించింది. విద్యార్థులు గ్రూపులుగా విడిపోయి వీధి రౌడీల్లా పిడిగుద్దులు కురిపించుకున్నారు. బాజీ జంక్షన్‌లో వాతావరణం ఒక్కసారిగా భీకరంగా మారిపోయింది. రెండు వర్గాల్లోని విద్యార్థులు ఆవేశంతో ఊగిపోతూ.. ఒకరివెనక ఇంకొకరు పరుగులు తీస్తూ.. దాడులు చేసుకుంటుంటే.. అటుగా వెళుతున్న వారంతా తీవ్ర భయాందోళనలకు గురయ్యా రు. ఏం జరుగుతుందో అర్థం కాక కంగారుపడ్డారు. ఈ వార్‌కు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ ఘర్షణ జరిగిన ప్రాంతానికి కూతవేటు దూరంలోనే గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ ఉంది. అయినప్పటికీ విద్యార్థులు భయం లేకుండా రెచ్చిపోవడం గమనార్హం.



ఘటనా స్థలం వద్ద స్థానికులను విచారిస్తున్న పోలీసులు



కళాశాల విద్యార్థులపై పిడిగుద్దులు గుద్దుతున్న బయట వ్యక్తులు

పెడదోవపడుతున్న విద్యార్థులు

నగరంలో కొంత మంది విద్యార్థి దశలోనే పెడదోవ పడుతున్నారు. అవకాశాలను అందిపుచ్చుకుని భవితకు బాటలు వేసుకోవాల్సిన వయసులో చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. ఎటువంటి ల క్ష్యం లేకుండా సరదాలు, మందు, డ్రగ్స్ వంటి దురలవాట్లకు బానిసలై విలువైన జీవితాన్ని పాడు చేసుకుంటున్నారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, కళాశాలల యాజమాన్యాలు కూడా పట్టించుకోకపోవడంతో విద్యార్థుల గతి తప్పుతోంది.

భయం లేకుండా..

కొంత మంది విద్యార్థులు, యువత భయం లేకుండా విచ్చలవిడితనంగా ప్రవర్తిస్తున్నారు. మరికొందరు మద్యం మత్తులో పోలీసులపై కూడా తిరగబడుతున్నారు. ఇటీవల కాలంలో పోలీసులపై దాడులకు పాల్పడుతున్నది 30 ఏళ్లలోపు వారే కావడం గమనార్హం. విద్యార్థి దశలో పెచ్చుమీరుతున్న వీరిని కట్టడి చేయడం పోలీసులకు సవాల్‌గా మారింది. విద్యార్థులపై కఠిన చర్యలకు ఉపక్రమిస్తే వారి జీవితాలు దెబ్బతింటాయని భావిస్తుండగా.. వీరు మాత్రం అదే అదునుగా చూసుకొని రెచ్చిపోతున్నారు.

గుర్తించకపోతే ముప్పే

చెడుబాట పడుతున్నట్లుగా గుర్తించాల్సింది తల్లిదండ్రులే. విద్యార్థి దశలో చెడు స్నేహాలతో సిగరెట్, మందుకు అలవాటు పడిన వారు మత్తు పదార్థాల వైపు వె ళుతున్నారు. అటువంటి వారిని తల్లిదండ్రులు పట్టించుకోకుంటే చాలామంది ఒత్తిడిలోకి వెళ్లే ప్రమాదముంది. వారిపై ఒక కన్నేసి ఉంచాలని పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలతో మంచి సంబంధం ఏర్పరచుకుని.. వారికి సరైన మార్గదర్శనం అందించాలి.

ప్రమాదాలు.. అల్లర్లలో వీరే..

గత కొంత కాలంగా నగరంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, గొడవలు, అల్లర్ల ఘటనల్లో విద్యార్థుల పాత్ర అధికంగా ఉంటుండడం గమనార్హం. ఇంటర్‌లోనే మందు కొడుతున్నారు. ఇంజినీరింగ్, డిగ్రీ, ఆపై స్థాయి విద్యలో చెడు అలవాట్లకు బానిస పడుతున్నారు. అంతే కాకుండా కొన్నిచోట్ల సంపన్న వర్గాల పిల్లలకు స్పోర్ట్స్ బైక్‌లు, కారులు, చేతి నిండా సొమ్ము ఉండడంతో వినోదంలో హద్దులు దాటేస్తున్నారు. మరికొన్ని చోట్ల పార్టీలు పేరుతో చెలరేగిపోతున్నారు. సాయంత్రం నుంచి అర్ధరాత్రుళ్ల వరకు రోడ్లు, ఆలయాలు ఇలా ఎక్కడపడితే అక్కడ మద్యం, ఇతర మత్తు పదార్థాలు సేవిస్తూ ఆ వైపుగా వెళ్లే వారిని భయాందోళనకు గురిచేస్తున్నారు. మరికొందరు గంజాయి సేవిస్తూ మత్తులో జోగుతున్నారు. మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతూ కొందరు, ప్రమాదానికి గురై కొందరు మృత్యువాత పడుతున్నారు.

సీనియర్, జూనియర్ల మధ్య కొట్లాట

గోపాలపట్నం: బుచ్చిరాజుపాలెం గాయత్రీ కళాశాల సీనియర్, జూనియర్ల మధ్య చెలరేగిన గొడవ మంగళవారం తీవ్ర ఘర్షణకు దారి తీసింది. సీనియర్ విద్యార్థిని జూనియర్ కొట్టాడంటూ మొదలైన వాగ్వాదం ఆ తర్వాత కొట్లాటగా మారింది. ఓ సీనియర్ విద్యార్థి అన్న, అతని స్నేహితులు కల్పించుకోవడంతో ఇరువర్గాలు కళాశాల సమీపం బాజీ జంక్షన్ రోడ్డు మధ్యలో బాహాబాహీకి దిగాయి. దీంతో రోడ్డుకు ఇరుపక్కలా వాహనాలు నిలిచిపోయాయి. విద్యార్థులను నిలువరించడానికి కళాశాల సిబ్బంది చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అరగంటకు పైగా ఘర్షణ జరిగింది. స్థానికుడొకరు 100కు ఫోన్ చేయడంతో ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్, గోపాలపట్నం సీఐ సురేష్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, యువకులు పారిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కళాశాల యాజమాన్యాన్ని విచారించారు. మరోమారు ఈ విధంగా జరగకుండా కళాశాల యాజమాన్యం కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఘర్షణను కొందరు వీడియోలు తీయగా, వాటి ద్వారా విద్యార్థుల్ని, బయటి వ్యక్తుల్ని గుర్తించి కళాశాలకు పిలిపించారు. వారి తల్లిదండ్రులను కూడా పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. ఈ ఘర్షణపై పూర్తి స్థాయిలో విచారణ జరుపుతున్నామని, ఇలాంటి సంఘటనలు ఇకపై జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్ తెలిపారు.

ఆమె పరుగు చిరుత కంటే వేగం.. ట్రాక్‌లో దిగిందంటే ట్రెండ్ సెట్ చేయాల్సిందే. ఆమె ట్రాక్ రికార్డు చూస్తే ఔరా అనాల్సిందే. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అందరి చూపు ఆమెపైనే ఉంది. ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ఫాస్టెస్ట్ వుమెన్ హర్డిలర్‌గా పోటీకి సిద్ధమైంది. విజయానికి రెప్ప పాటు దూరంలో ఉంది. ఈ విశాఖ కెరటం జ్యోతి యర్రాజి. పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్స్‌లో నేడు అథ్లెటిక్ హీట్స్‌లో జ్యోతి తన సత్తా చాటుకునేందుకు సిద్ధమైంది. ఒలింపిక్స్ పతకం తీసుకురావాలి.. విశాఖ మురిసిపోవాలి.. జాతి గర్వించాలి...

ఆల్ ది బెస్ట్ జ్యోతి..


చిరుతలా జ్యోతి

జ్యోతి వెలగాలి జాతి మురవాలి

విశాఖ స్పోర్ట్స్ : జ్యోతి తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తుండగా, ఆమె తల్లి కుమారి గృహిణి. జ్యోతి విశాఖలోని పోర్ట్ హైస్కూల్ చదువుకుంది. పోర్టు స్కూల్‌లో చదివే పిల్లలకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. వంద, 200, 400 మీటర్లు, రిలేల్లో సైతం పాల్గొనేది. అక్కడ జ్యోతి రాణిస్తుండడంతో క్రీడాప్రాధికార సంస్థకు చేరింది. శాప్ కోచ్ రమేష్‌వద్ద రెండేళ్లు శిక్షణ పొందింది. అక్కడ 2019లో గుంటూరులో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు చేరింది. గాయంతో పాటు కోవిడ్‌తో శిక్షణ అటకెక్కింది. అప్పటి వరకూ జాతీయ స్థాయిలో రాణించిన జ్యోతి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఇక్కడే మలుపు తిరిగింది. లెగ్ రన్నర్ కాస్తా ఫాస్టెస్ట్ రన్నర్‌గా రూపాంతరం చెందింది. బ్రిటీష్ కోచ్ జేమ్స్ హిల్లియర్ శిక్షణలో పొడుగు కాళ్ల అథ్లెట్ జ్యోతి హర్డిలర్‌గా మారిపోయింది. అంతర్జాతీయ పతకాలతో ప్రపంచ ర్యాంకింగ్‌లో 24కు చేరింది. ఒలింపిక్స్‌కు భారత్ తరఫున వుమెన్ ఫాస్టెస్ట్ హర్డిలర్ పోటీకి విశాఖ అథ్లెట్ జ్యోతి సిద్ధమైంది.

జాతీయ రికార్డు

2022లో మే పదో తేదీ. చాలా ఏళ్లుగా నమోదైన వంద మీటర్ల వుమెన్ హర్డిల్స్ రికార్డు బద్దలైంది. అప్పటి వరకు అనురాధా బిస్వాల్ పేరిట ఉన్న రికార్డును జ్యోతి 13.23 సెకన్లలోనే పూర్తి చేసి జాతీయ రికార్డును నెలకొల్పింది. తన రికార్డును తనే పలు మార్లు బ్రేక్ చేసింది.

అనర్హతే ఆరంభమైంది

2022 ఆసియా క్రీడల్లో వంద మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి ఫాల్స్ స్టార్ట్ చేసిందంటూ అనర్హత వేటు వేశారు. అప్పుడప్పుడే అంతర్జాతీయ పోటీల్లో పతకాల వేట మొదలెట్టింది. అనర్హతను ధైర్యంగానే ఎదుర్కొంటూ అథ్లెటిక్ సమాఖ్య సహకారంతో అపీల్ చేసింది. చివరికి చైనా అథ్లెట్‌దే తప్పుగా తేలడంతో 12.91 సెకన్లలో పూర్తి చేసిన జ్యోతికి రజత పతకం ప్రకటించారు.

కాంటింజెంట్‌తో శిక్షణ తీసుకున్నా...



ఒలింపిక్స్‌లో అర్హత సాధించాలని కల గన్నా. అది నెరవేరింది. పోలాండ్‌లో అథ్లెటిక్ కాంటింజెంట్‌కు జరిగిన శిక్షణలో పాల్గొన్నా. వంద మీటర్ల హర్డిల్స్‌లో సత్తా చాటేందుకు పూర్తి సన్నద్ధంగా ఉన్నా. పతకం సాధిస్తాననే నమ్మకం ఉంది. బుధవారం హీట్స్ జరగనున్నాయి. ప్రస్తుతం ఒలింపిక్ రికార్డు 12.26తో నమోదై ఉంది.

–జ్యోతి యర్రాజి, జాతీయ రికార్డు హర్డిలర్

ఏడుగురు పిల్లలకు ఉచిత గుండె ఆపరేషన్లు

త్వరలో సినీనటుడు మహేష్ బాబుతో ప్రచారం



ఆపరేషన్ జరిగిన పిల్లలు, కుటుంబ సభ్యులతో ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ రామారావు

మహారాణిపేట: ఆంధ్ర హాస్పిటల్స్‌లో హీలింగ్ లిటిల్ హార్ట్స్, యూకే చారిటీ సౌజన్యంతో పిల్లలకు ఉచితంగా గుండె సంబంధిత సర్జరీలు సోమవారం ప్రారంభించగా బుధవారం వరకు కొనసాగుతాయని ఆస్పత్రి డైరెక్టర్, చీఫ్ ఆఫ్ చిల్డ్రన్ సర్వీసెస్ డైరెక్టర్ డాక్టర్ పీవీ రామారావు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ వద్ద ఉన్న ఆంధ్రా ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆపరేషన్ జరిగిన పిల్లల తల్లిదండ్రులతో కలిసి ఆయన మాట్లాడారు. డాక్టర్ రామారావు, డాక్టర్ విక్రమ్ వైద్య శిబిరం వివరాలు వెల్లడించారు. తొమ్మిదేళ్లుగా ఆంధ్రా హాస్పటల్స్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 30 సార్లు, విశాఖలో తొలిసారిగా పిల్లలకు ఉచితంగా గుండె ఆపరేషన్లు నిర్వహించామన్నారు. త్వరలో ప్రముఖ సినీనటుడు మహేష్‌బాబును విశాఖ తీసుకొచ్చి..విస్తృత ప్రచారం కల్పిస్తామన్నారు. డాక్టర్ రమణ దన్నపనేని, సీనియర్ పిల్లల కార్డియాక్ సర్జన్, ఆల్డర్ హే హాస్పిటల్స్, లివర్ పూల్, యూకే నుంచి వచ్చిన డాక్టర్ రేవంత్, కార్డియాక్ సర్జన్‌తో కలిసి, డాక్టర్ విక్రమ్ ఆధ్వర్యంలో ఏడుగురు పిల్లలకు గుండె ఆపరేషన్లు నిర్వహించామన్నారు. సమావేశంలో వైద్యులు సుబ్రహ్మణ్యం, డాక్టర్ రమేష్, రేవంత్, రవీంద్రదేవ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

మరో విద్యార్థిని బలిగొన్న 'గంభీరం'

- ఊబిలో చిక్కుకుని మృతి చెందిన హితేష్
- మృతుడిది రాజమండ్రి

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం రిజర్వాయర్ మూడు రోజుల వ్యవధిలో మరొక ఇంజినీరింగ్ విద్యార్థిని బలి తీసుకుంది. శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన గీతం విద్యార్థి డోకి నిరంజన్‌ను ఆదివారం పొట్టన పెట్టుకున్న రిజర్వాయర్.. మంగళవారం మధ్యాహ్నం రాజమహేంద్రవరం సీతానగర్ కాలనీ వాసి, గాయత్రీ ఇంజినీరింగ్ విద్యార్థి నీరుకొండ హితేష్‌ను మింగేసింది. ఈ ఇద్దరు విద్యార్థులను తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది వెలికితీసి ఇక్కడ ప్రమాద తీవ్రతను తెలియజేశారు. ఆనందపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొమ్మాది గాయత్రీ ఇంజినీరింగ్ కళాశాలలో ఈఈఈ రెండో సంవత్సరం విద్యార్థి హితేష్ స్నేహితులతో కలసి ఈత కోసం రిజర్వాయర్‌కు వెళ్లాడు. ఈ క్రమంలో కాలు జారి హితేష్ ఊబిలో చిక్కుకుపోయి మృతి చెందాడు. సమాచారం అందుకున్న తాళ్లవలస అగ్నిమాపక శాఖ సిబ్బంది అక్కడకు చేరుకుని.. అతని మృతదేహాన్ని వెలికితీశారు. ఆనందపురం పోలీసులు ఈ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ సంతోష్, ఏఎస్‌ఐ నూకరాజు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. అతని తల్లిదండ్రులు అభిషేక్, హిమాబ్ ఫిర్యాదు మేరకు సీఐ టీవీ తిరుపతిరావు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.


మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న తాళ్లవలస అగ్నిమాపక సిబ్బంది(ఇన్‌సెట్) మృతుడు హితేష్

23.5 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయి రవాణా చేస్తున్న యువకుడ్ని రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... గవర్నమెంట్ రైల్వే పోలీసు (జీఆర్పీ), రైల్వే భద్రతా దళం (ఆర్పీఎఫ్) ఉన్నతాధికారులు ఆదేశాలతో శనివారం జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో ఆర్పీఎఫ్ ఎస్‌ఐ జేకే మీనా సిబ్బందితో పలు ప్లాట్‌ఫారాలపై ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో రత్నగిరి జిల్లా, మహారాష్ట్రకు చెందిన ఇమ్రాన్ మహ్మద్ ఖాజీ గంజాయి రవాణా చేయడం గుర్తించారు. విశాఖ మీదుగా ముంబైకి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. రూ.1,17,500 విలువ గల 23.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొన్నారు. నిందితుడ్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


నిందితుడితో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

సమాజ హితానికి అంతరిక్ష ప్రయోగాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐఐఎస్ఎస్‌టీ చాన్స్‌లర్ సురేష్

కొమ్మాది: ఆరు దశాబ్దాల్లో భారతదేశ అంతరిక్ష పరిజ్ఞానం గణనీయంగా వృద్ధి చెందిందని ఖర్చు చేసిన ప్రతి పైసాకు మూడింతలుగా ప్రయోజనం లభించిందని అంతరిక్ష శాస్త్రవేత్త, పద్మభూషణ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐఐఎస్ఎస్‌టీ) చాన్స్‌లర్ డా.బీఎన్ సురేష్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం, కండీషన్ మానటరింగ్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మంగళవారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆయన సామాన్యుడి ప్రయోజనాల కోసం అంతరిక్ష పరిజ్ఞానం అనే అంశంపై ప్రసంగించారు. ఒకప్పుడు అంతరిక్ష ప్రయోగాలకు ఇతర దేశాలపై ఆధారపడిన భారత దేశం నేడు 34 దేశాలకు చెందిన 432 ఉపగ్రహాలను భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఆయా దేశ అవసరాలకు ప్రయోగించే స్థాయికి చేరిందన్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అత్యధికంగా 56 ఆపరేషనల్ శాటిలైట్స్, భారత అంతరిక్ష ప్రయోగశాలల నుంచి ప్రయోగించడం విశేషం అన్నారు. ఈ కార్యక్రమంలో భారత ప్రభుత్వ రక్షణ పరిశోధనా సంస్థ మాజీ డైరెక్టర్ జనరల్, కిమ్స్ ఫౌండేషన్ చైర్మెన్ డా. వి. బుజంగరావు, గీతం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు పాల్గొన్నారు.

అందుబాటులో విజ్ఞాన కేంద్రాలు

విశాఖ సిటీ: పర్యాటక రంగానికి సంబంధించిన విజ్ఞాన కేంద్రాలను విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా పర్యాటక శాఖ అధికారి కుంచె జ్ఞానవేణి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని కాలేజీ, స్కూల్ విద్యార్థులకు ఎడ్యుకేషనల్ టూర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వీఎంఆర్‌డీఏ కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సంబంధిత అధికారులతో ఆమె సమావేశమయ్యారు. మెరైన్ మ్యూజియం ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా సీ హారియర్, టీయూ 142, సబ్‌మెరైన్ మ్యూజియం, జీవ వైవిధ్య విద్యా పర్యటనలో భాగంగా ఇందిరాగాంధీ జులాజికల్ పార్క్‌ను అనుసంధానం చేస్తూ ప్రణాళిక రూపొందించారు. అలాగే మెరైన్ లైఫ్ వాక్, యూనివర్సిటీలో విజ్ఞాన కేంద్రాలను కూడా సందర్శించవచ్చని సంబంధిత ప్రొఫెసర్లు వివరించారు. విద్యార్థులకు రాయితీ ఉంటుందన్నారు. ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఎ.ఆర్.రాజు, ఓషనోగ్రఫీ నుంచి సునీత, పర్యావరణ విభాగం నుంచి ఎ.జె.పవన్‌రాజు, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్‌ఐవో మురళీధర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.జ్యోతి, టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ నుంచి కుమార్ హాజరయ్యారు.

ఐఎస్‌పీఏ ఫెలోగా ఆచార్య ఎంవీఆర్ రాజు

విశాఖ సిటీ: ఇండియన్‌స్కూల్ సైకాలజీ అసోసియేషన్ 2024 సంవత్సరానికి ఫెలోఆఫ్ ఈఎస్‌పీఏగా ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్, సైకాలజీ విభాగం ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.రాజు ఎంపికయ్యారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను రాజుకు ఐఎస్‌పీఏ అధ్యక్షుడు ఆచార్య పి.రామలింగం పంపించారు. అక్టోబర్‌లో తమిళనాడు కేంద్రీయ విశ్వవిద్యాలయంలో జరిగే 14వ ఐఎస్‌పీఏ అంతర్జాతీయ సదస్సులో ఆచార్య ఎం.వి.ఆర్.రాజుకు దీనిని బహూకరిస్తారు. ఈ సందర్భంగా రాజును ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అభినందించారు.

అసిస్టెంట్ కమాండెంట్‌కు బదిలీ


మల్లికార్జున రావును సత్కరిస్తున్న పద్మనాభరాజు

పీఎంపాలెం: బక్కన్నపాలెం ఏపీఎస్‌పీఎఫ్ పోలీస్ శిక్షణా కేంద్రంలో పనిచేస్తున్న 16 వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ సీహెచ్. మల్లికార్జునరావు ఇంటలిజెన్సీ డిపార్ట్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను 16 పోలీస్ బెటాలియన్ ఇన్‌చార్జ్ కమాండెంట్ సీహెచ్ వీఎస్ పద్మనాభరాజు మంగళవారం ఘనంగా సత్కరించారు. మల్లికార్జునరావు గతంలో రాష్ట్రగవర్నర్ కార్యాలయంలో చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పద్మనాభరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఇళయసాగర్, ఆర్‌ఐలు ఆర్ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరి విద్యార్థుల అదృశ్యం


సింగిడి సాత్విక్


షణ్ముక

తగరపువలస: భీమిలి మండలం తాటితూరుకు చెందిన 8వ తరగతి విద్యార్థులు సింగిడి సాత్విక్, రాంబోతు షణ్ముక సోమవారం అదృశ్యమయ్యారు. స్కూల్ నుంచి ఇంటికి వెళ్లిన వీరు అక్కడ నుంచి తగరపువలస మీదుగా వెళ్లినట్టు అంబేద్కరు కూడలిలోని సీసీ కెమెరాలలో రికార్డయింది. వీరిలో ఒకరివద్ద రూ.1950, మరొకరి వద్ద రూ.150 ఉన్నట్టు తెలిసింది. విద్యార్థుల బంధువుల ఇళ్లలో గాలించినా ఆచూకీ తెలియకపోడంతో వారి తల్లిదండ్రులు భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యాపారికి వినియోగదారుల ఫోరం జరిమానా

విశాఖ లీగల్: నాణ్యమైన వస్తువు విక్రయించని వ్యాపారిపై విశాఖ వినియోగదారుల ఫోరం–2 అధ్యక్షురాలు, న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే.. విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన డాక్టర్ ఆర్. సింహాద్రప్పడు 2020 సెప్టెంబర్‌లో ఐయాన్ కంపెనీ తయారు చేసిన జీరో–బి ఏఎస్3 మోడల్ వాటర్ సాఫ్టనర్‌ను కంపెనీ డీలర్ నుంచి కొనుగోలు చేశారు. ఇందుకోసం రూ.73,500 చెల్లించారు. అయితే కంపెనీ డీలర్ ఆర్డర్ చేసిన మోడల్‌కు బదులు దానికంటే ఉత్తమమైనదని నమ్మించి మరో మోడల్‌ను అమర్చాడు. అయితే అది సక్రమంగా పనిచేయకపోవడంతో సింహాద్రప్పడు పలుమార్లు డీలర్‌కు ఫిర్యాదు చేశాడు. ఎన్నిసార్లు మరమ్మతులు చేసినా పనిచేయకపోవడంతో కొనుగోలుదారుడు వినియోగదారుల ఫోరాన్ని ఆశ్రయించారు. దీనిపై ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాధారాలు పరిశీలించిన న్యాయమూర్తి డీలర్‌కు కొనుగోలుదారుడు చెల్లించిన రూ.73,500 వాపసు చేయాలని, అలాగే రూ.50 వేలు నష్టపరిహారంతో పాటు రూ.10 వేలు కోర్టు ఖర్చులు కింద చెల్లించాలని తీర్పునిచ్చారు.

బాలికతో అసభ్యకర ప్రవర్తన

సీతమ్మధార : అక్కయ్యపాలెం అబిద్ నగర్ పార్కులో ఓ బాలిక(8)తో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలిలా ఉన్నాయి. దొండపర్తికి చెందిన 50 ఏళ్ల ఎండీ ఇషాక్ అనే వ్యక్తి అబిద్‌నగర్ పార్కులో మంగళవారం రాత్రి 7.30 గంటల సమయంలో ఆడుకుంటున్న బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ విషయాన్ని బాలిక తన తండ్రికి చెప్పడంతో ఆయన సీపీ శంఖబత్ర బాగ్చికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ.. ఈ ఘటనపై విచారణ చేపట్టాలని నాలుగో పట్టణ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

• విద్యార్థులూ.. జాగ్రత్తర్రా..!



కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే సమయంలో అందుబాటులో బస్సులు ఉండడం లేదు. దీంతో ప్రమాదమని తెలిసినా విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో ఫుట్‌బోర్డుపై ప్రయాణించాల్సి వస్తోంది. ప్రాణాలకు తెగించి ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్నారు. గురుద్వారా జాతీయ రహదారిలో ఈ ప్రయాణం నరకంగా మారింది. మద్దిలపాలెం నుంచి ఎన్‌ఏడీ కొత్తరోడ్డు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో విద్యార్థుల ప్రయాణం నరకంగా మారింది. ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఇగ్నో ప్రవేశాల గడువు పొడిగింపు

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024 విద్యా సంవత్సరం జూలై ప్రవేశాల గడువును పొడిగించింది. ఈ మేరకు ఇగ్నో విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ గోనిపాటి ధర్మారావు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 14లోగా దరఖాస్తు చేసుకోవచ్చు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■ 100% బ్యాంక్‌లోన్‌తో పెందుర్తి, పినగాడి దగ్గరలో 3 నేషనల్ హైవేస్ మధ్యలో 68 ఎకరాల అప్రూవ్డ్ లే అవుట్‌లో గజం @ 8599/- & ఇండిపెండెంట్ 2BHK హౌస్ @ 36 L. డూప్లెక్స్ 3BHK @ 45L మాత్రమే. ✆ 98859 57795. [V-3169]

Services

BUSINESS OFFER

■ మీరు బైబ్యాక్ అగ్రిమెంట్‌తో లాభదాయకమైన లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబీ డైపర్ మెషీన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ వ్యాపారాన్ని ప్రారంభించండి. (ప్రభుత్వ ఆమోదితము) 83760 01873, 96430 10487, 83760 89771, 011-25920179 [DA-5872]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12256]

Wanted

■ మధురవాడ నందు ఆఫీసు అడ్మినిస్ట్రేషన్‌లో పనిచేయుటకు 2 సం॥ అనుభవం కలిగిన కంప్యూటర్ ఆపరేటర్ మరియు అసిస్టెంట్ అకౌంటెంట్స్ కావలెను. ఫోన్ : 94947 11811, pardhumgt@gmail.com [V- 776867]

CHANGE OF NAME

I, Gopidi Sreedhar Reddy (New Name), S/o. G. Srinivas Reddy, previously called Gopidi Sridhar Reddy (Old Name), Resident of 50-48-20/1, P&T Colony, Seethammadhara, Visakhapatnam & presently address 55-14-106/5, APSEB Colony, Seethammadhara, Visakhapatnam- 530013. Now changed my name from Gopidi Sridhar Reddy (Old Name) to Gopidi Sreedhar Reddy (New Name). Hence forth I will be called as Gopidi Sreedhar Reddy(New Name) for all purpose.

■ ఫర్నిచర్ షోరూమ్ కొరకు సేల్స్‌మెన్స్ & గర్ల్స్ (Up to 20,000/-) డ్రైవర్ (16000/-), హెల్పర్స్ (13000) కావలెను. ఫోన్ : 77299 49079. [V- 12467]

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206, 9573633520. [M-1185276]

■ కావలెను : 1000 Hours ల్యాబ్ టెక్నీషియన్ ఫ్రీ జాబ్ కోచింగ్ స్టైఫండ్‌తో ఉద్యోగాలు ఇంటర్ సైన్స్‌తో పాస్ అప్లై Age : 18-34 - అపోలో, కేర్, సెవెన్‌హిల్స్, సంస్థ మెడికవర్, KGH, వైజాగ్‌లో. ఫోన్ : 63046 20848, 80746 99673 [V- 6530]

సాక్షి రియల్టీ
రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి
www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ / MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

ఇండియన్ బ్యాంక్ ఎం.వి.పి. కాలనీ శాఖ
ప్లాట్ నెం.11, ఎం.ఐ.జి-1, సెక్టార్-2, ఎం.వి.పి.కాలనీ, విశాఖపట్నం-530017, ఫోన్: 0891-2520222

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన
"APPENDIX- IV-A" (రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వబడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, ఎం.వి.పి.కాలనీ శాఖ, విశాఖపట్నం యొక్క అధీకృత అధికారి సాంకేతికంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.11-09-2024న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, ఎం.వి.పి.కాలనీ శాఖ, విశాఖపట్నంకు బకాయి మొత్తం ది.27-07-2024 నాటికి రూ.43,06,249/- (అక్షరాల నలభై మూడు లక్షల ఆరు వేల రెండు వందల నలభై తొమ్మిది రూపాయలు మాత్రము) తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. ఋణగ్రహీత: శ్రీమతి నాగరత్నం బండి, భర్త : శ్రీ బండి ప్రసాద్ (దరఖాస్తుదారు), మరియు శ్రీ బండి ప్రసాద్, తండ్రి : శ్రీ బండి పైడిరాజు (సహ-దరఖాస్తుదారు), ఫ్లాట్ నెం.101, గ్రౌండ్ ఫ్లోర్, వై.ఎస్. శోభా రెసిడెన్సీ, ఆర్టీసి టిబిసి పాయింట్ దగ్గర, అరిలోవ, విశాఖపట్నం - 530040.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

ఆస్తి యొక్క పూర్తి వివరణ :	రిజర్వు ధర	ధరావత్తు	ఈ - వేలము తేది మరియు సమయం	ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్
విశాఖపట్నం జాయింట్ యస్ఆర్ఓ, గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, చినగదిలి గ్రామం, అరిలోవ సర్వే నెం.36లోని మొత్తం విస్తీర్ణం 642.44 లేదా 537.16 చ॥మీ॥లలో 321.22 చ॥గ॥లు లేదా 268.58 చ॥మీ॥లలోని 34 చ॥గ॥లు లేదా 28.42 చ॥మీ॥ల అవిభాజ్య మరియు అనిర్దేశపు వాటాతో గల స్థలం అందు "వై.యస్.శోభ రెసిడెన్సీ", క్రింద అంతస్తు, 888 చ॥అ॥లు (కామన్ ఏరియాలు, బాల్కనీలతో సహా) ఏరియా, స్టిల్ట్ ఫ్లోర్ నందు కార్ పార్కింగ్‌తో గల ఫ్లాట్ నెం.101. (డాక్యుమెంట్ నెం.498/2018, తేది:29-01-2018, యస్ఆర్ఓ, విశాఖపట్నం (ఆర్.ఓ) ప్రకారం) స్థలంకు హద్దులు : తూర్పు : 30 అ॥ల వెడల్పు రోడ్డు, దక్షిణం : డి.రాఘవేంద్రరావు గారికి చెందిన ప్లాట్ నెం.37, పడమర : 30 అ॥ల వెడల్పు రోడ్డు, ఉత్తరం : ప్లాటు నెం.39 లోని ఇల్లు. ఫ్లాట్ నెం.101కు హద్దులు : తూర్పు : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, దక్షిణం : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, పడమర : కామన్ కారిడార్ మరియు ఫ్లాట్ నెం.102, ఉత్తరం : ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్. ఆస్తి ఐడి నెం. : ఐడిఐబి30247194671	రూ. 34,20,000/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల ఇరవై వేల రూపాయలు మాత్రమే)	రూ. 3,42,000/- (అక్షరాల మూడు లక్షల నలభై రెండు వేల రూపాయలు మాత్రమే)	11-09-2024 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు (బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్ల డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ అవసరం లేదు) బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు)	లేదు

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.10.09.2024 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్‌సైట్ (www.psballiance.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు M/s PSB Alliance హెల్ప్‌డెస్క్ నెం. 8291220220 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. M/s PSB Alliance. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి psba@psballiance.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి https://ebkray.in/eauction-psb/bidder-registration సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ebkray.inను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 8291220220 నందు సంప్రదించండి. https://ebkray.in/eauction-psb/bidder-registration లో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

ప్రదేశం : విశాఖపట్నం
తేది : 02-08-2024
సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, విశాఖపట్నం

Scan For Document | Scan For E-Auction Website | Scan For Indian Bank Tenders | Scan For Image of Property - 1 | Scan For Image of Property - 2 | Scan For Video of Property

ఇండియన్ బ్యాంక్ సీతమ్మధార బ్రాంచ్
డోర్ నెం.50-96-8/5, మొదటి అంతస్తు, ప్లాట్ నెం.ఎమ్ఐజి-23, సీతమ్మధార, ఎన్ఐ లే అవుట్, విశాఖపట్నం - 530013. ఫోన్. 0891-2723300

స్థిరాస్తుల అమ్మకానికి అమ్మకం ప్రకటన
"APPENDIX- IV-A" (రూలు 8(6)కు నిబంధన చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూలు 8(6) నిబంధనలతో చదువబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

ఈ విధంగా సాధారణంగా ప్రజలకు మరియు ఋణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు నోటీసులు ఇవ్వబడమైనది. క్రింద వివరించిన స్థిరాస్తి సెక్యూర్డు క్రెడిటార్, తనఖా పెట్టిన వీటిని ఇండియన్ బ్యాంక్, సీతమ్మధార శాఖ, విశాఖపట్నం యొక్క అధీకృత అధికారి సాంకేతికంగా స్వాధీనతలోనికి తీసుకున్నారు. అమ్మకం "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలాగే మరియు అక్కడ ఏమున్నదో అదే" పద్ధతిపై ది.11-09-2024న అమ్మబడుతుంది. ఇండియన్ బ్యాంక్, సీతమ్మధార శాఖ, విశాఖపట్నంకు బకాయి మొత్తం ది.31-07-2024 నాటికి రూ.8,68,367/- (అక్షరాల ఎనిమిది లక్షల అరవై ఎనిమిది వేల మూడు వందల అరవై ఏడు రూపాయలు మాత్రము)+ తేది.01.08.2024 నుండి తదుపరి జమకూడు వడ్డీ, ఖర్చులు, ఇతర ఛార్జీలు మొ॥నవి. ఋణగ్రహీత నివాస చిరునామా : శ్రీ బుదుమూరి సురేష్ కుమార్, తండ్రి : అప్పారావు, టిఎఫ్-2, 3వ ఫ్లోర్, డి.నెం.7-153/2/12, విజయ రెసిడెన్సీ, మధురవాడ, విశాఖపట్నం - 530013. సహ-ఋణగ్రహీత: నివాస చిరునామా: శ్రీమతి బి. కాంతి చరణ, భర్త : సురేష్ కుమార్, టిఎఫ్-2, 3వ ఫ్లోర్, డి.నెం.7-153/2/12, విజయ రెసిడెన్సీ, మధురవాడ, విశాఖపట్నం - 530013.

ఇ-వేలం ద్వారా అమ్మకానికి ప్రతిపాదించబడిన ఆస్తుల యొక్క నిర్దిష్ట వివరములు దిగువన పేర్కొనబడినవి

ఆస్తి యొక్క పూర్తి వివరణ :	రిజర్వు ధర	ధరావత్తు	ఈ - వేలము తేది మరియు సమయం	ఆస్తిపై ఎన్‌కంబ్రెన్స్
గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మరియు మధురవాడ రిజిస్ట్రేషన్ సబ్ డిస్ట్రిక్ట్, మధురవాడ గ్రామం, సర్వే నెం.199/12, పంచాయితీ ఆమోదం పొందిన లే అవుట్ యొక్క ప్లాట్ నెం.5 లోని 433 చ॥గ॥లు లేదా 361.988 చ॥మీ॥ల మొత్తం విస్తీర్ణంలో 30 చ॥గ॥లు లేదా 25.08 చ॥మీ॥ల అవిభాజ్యపు మరియు అనిర్దేశ్యపు వాటా విస్తీర్ణంలో నిర్మించిన "విజయ్ రెసిడెన్సీ" మూడవ అంతస్తు నందు 730 చ॥అ॥ల బిల్టప్ ఏరియా (కామన్ ఏరియాలతో సహా), అసెస్మెంట్ నెం.100008/83005, డోర్ నెం.7-153/2/12తో గల ఫ్లాట్ నెం.టిఎఫ్-2 యావత్తు ఆస్తి. మొత్తం అపార్ట్‌మెంట్‌కు హద్దులు : ఉత్తరం : గెడ్డ, తూర్పు : 24 అ॥ల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.6, దక్షిణం : ప్లాట్ నెం.లు 10 మరియు 11. మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.టిఎఫ్-2కు హద్దులు : ఉత్తరం : ఓపెన్ టెర్రాస్, తూర్పు : మెట్లు మరియు కామన్ కారిడార్, పడమర: ఓపెన్ స్పేస్, దక్షిణం : ఓపెన్ స్పేస్. ఆస్తి ఐడి నెం.: IDIB3102281553	రూ. 19,60,000/- (అక్షరాల పంతొమ్మిది లక్షల అరవై వేల రూపాయలు మాత్రమే)	రూ. 1,96,000/- (అక్షరాల ఒక లక్ష తొంభై ఆరు వేల రూపాయలు మాత్రమే)	11-09-2024 సమయం : ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు (బిడ్డింగ్ ప్రక్రియలో పాల్గొనడానికి బిడ్డర్ల డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్ అవసరం లేదు) బిడ్ పెంపుదల మొత్తం : రూ. 10,000/- (అక్షరాల పదివేల రూపాయలు)	లేదు

ఇ-వేలంలో పాల్గొనడానికి ఇఎమ్‌డి మొత్తాన్ని చెల్లించడానికి చివరి తేది మరియు సమయం : ది.10.09.2024 & సాయంత్రం గం.5 :00 ని॥లకు

వేలం బిడ్ ఫారం మరియు నియమనిబంధన వివరములను మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ M/s PSB Alliance వారి వెబ్‌సైట్ (www.psballiance.com) నందు ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనుటకు చూడవలసినదిగా బిడ్డర్స్‌కు సలహానీయటమైనది. ఇ-వేలం పూర్తి విధానం సాంకేతిక సహాయం కొరకు M/s PSB Alliance హెల్ప్‌డెస్క్ నెం. 8291220220 మరియు సర్వీసు ప్రొవైడర్‌లో లభించు ఇతర హెల్ప్‌లైన్ నెంబర్‌లను సంప్రదించండి. M/s PSB Alliance. రిజిస్ట్రేషన్ స్టేటస్ కోసం దయచేసి psba@psballiance.com మరియు ధరావత్తు స్టేటస్ కోసం దయచేసి https://ebkray.in/eauction-psb/bidder-registration సంప్రదించవచ్చును. ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫొటోగ్రాఫ్ మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://ebkray.inను సంప్రదించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణలకోసం హెల్ప్‌లైన్ నెంబర్ 8291220220 నందు సంప్రదించండి. https://ebkray.in/eauction-psb/bidder-registration లో వెబ్‌సైట్‌లోని ఆస్తికోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ఐడి నెంబర్‌ను ఉపయోగించి బిడ్డర్లు చూడగలరు.

ప్రదేశం : విశాఖపట్నం
తేది : 03-08-2024
సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్

Scan For E-Auction Website | Scan For Indian Bank Tenders | Scan For Image of Property | Scan For Document | Scan For Video of Property